ఆరోగ్య సురక్షతో పేదలకు అభయం

- వైఎస్సార్‌సీపీ 'ఉత్తర' సమన్వయకర్త కె.కె.రాజు
- వైద్య శిబిరాలకు విశేష స్పందన



విద్యుత్‌నగర్‌లో వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న కె.కె.రాజు, కార్పొరేటర్ కంపా హనోకు



14వ వార్డు వైద్య శిబిరంలో మందులు అందజేస్తున్న కె.కె.రాజు, కార్పొరేటర్ అనిల్‌కుమార్‌రాజు

సీతమ్మధార: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం పేదల వైద్యానికి భరోసాగా నిలిచిందని వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త, నెడ్‌క్యాప్ చైర్మన్ కె.కె.రాజు అన్నారు. జీవీఎంసీ 14వ వార్డు 110 సచివాలయం పరిధి మారుతీ నగర్, తమిళ్ కల్యాణ మండపంలో, 46వ వార్డు 263 సచివాలయం పరిధి సంజీవయ్య కాలనీలోని అతిథి కల్యాణ మండపంలో బుధవారం నిర్వహించిన ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలను ఆయన సందర్శించారు. వైద్య పరీక్షలు చేయించుకున్న వారిని పలకరించి, మెడికల్ షీట్లను, ఉచితంగా పంపిణీ చేస్తున్న మందులను పరిశీలించారు. ఈ సందర్భంగా కె.కె.రాజు మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా ప్రజలను ఆరోగ్యవంతులుగా చేయడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ఇప్పటి వరకు ఏ ప్రభుత్వం చేయని విధంగా సీఎం వైఎస్ జగన్ సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని చెప్పారు. వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకంలో అనేక వ్యాధులను చేర్చారన్నారు. లక్షల మందికి రూపాయి ఖర్చు లేకుండా ఉచితంగా వైద్య సేవలు అందిస్తున్నారని, ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో జీవీఎంసీ డిప్యూటీ మేయర్, పార్టీ మండల అధ్యక్షుడు కటుమూరి సతీష్, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ కంపా హనోకు, 14వ వార్డు కార్పొరేటర్ కె.అనిల్‌కుమార్‌రాజు, వార్డు అధ్యక్షులు నీలి రవి, పైడి రమణ, కిరణ్‌రాజు, పీలా వెంకటలక్ష్మి, హరి పట్నాయక్, సునీల్‌కుమార్, ప్రవీణ్ వర్మ, సెక్యూరిటీ శ్రీను, కె.సుశీల, కె.సత్యనారాయణ, దుర్గాభవానీ, లావణ్య, జీవీఎంసీ అధికారులు, సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు పాల్గొన్నారు.

వైద్య శిబిరాలతో ప్రజలకు మేలు

సీతంపేట: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ప్రజల ఆరోగ్యానికి రక్షగా నిలిచిందని వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త, నెడ్‌క్యాప్ చైర్మన్ కె.కె.రాజు అన్నారు. 45వ వార్డు 252 సచివాలయానికి సంబంధించి ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం బుధవారం అక్కయ్యపాలెం ఎన్జీజీవోస్ కాలనీలోని విద్యుత్‌నగర్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జరిగింది. కార్పొరేటర్ కంపా హనోకుతో కలిసి ఆయన వైద్య సేవలు ఎలా అందుతున్నాయో పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రమాదకర వ్యాధులను ప్రాథమిక స్థాయిలోనే గుర్తించి రోగులకు తగు వైద్యం అందించాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా జగనన్న ఆరోగ్య సురక్ష పేరిట వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నారన్నారు. సచివాలయం పరిధిలోని ప్రతి ఒక్కరూ వైద్య సేవలను సద్వినియోగం చేసుకుని, ఆరోగ్యాన్ని సంరక్షించుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షులు పైడి రమణ, పీలా వెంకటలక్ష్మి, బి.గోవింద్, హరిపట్నాయక్ తదితరులు పాల్గొన్నారు.

'జగనన్న ఆరోగ్య సురక్ష'పై సమీక్ష



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్

కంచరపాలెం: జీవీఎంసీ 46వ వార్డు తాటిచెట్లపాలెం శాంతినగర్ సచివాలయలో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్షపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జీవీఎంసీ డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్ మాట్లాడుతూ ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ సాధన దిశగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రణాళిక చేశారన్నారు. వార్డుల్లో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు పక్కాగా నిర్వహించేందుకు వైద్యాధికారులు, ఆయా సచివాలయాల సిబ్బంది, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా వర్కర్లు సిద్ధంగా ఉండాలన్నారు. ప్రజలకు ఆరోగ్య పరీక్షలు చేయించడంలో ఉత్సాహంగా పనిచేయాలని కోరారు. ఈ మేరకు పబ్లిక్ హెల్త్, వైద్యాధికారులతో ఆయన సమీక్షించారు. జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ప్రజలను కోరారు. వార్డులో పర్యటించి యూపీహెచ్‌సీల్లో వైద్య సిబ్బంది చేస్తున్న సర్వేను కటుమూరి సతీష్ పరిశీలించారు. కార్యక్రమంలో జేఏఎస్ స్పెషల్ ఆఫీసర్ శైలజ, సీవో వరలక్ష్మి, వలంటీర్లు, ఆశా వర్కర్లు, ఏఎన్‌ఎంలు, సచివాలయ సిబ్బంది, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేటి నుంచి అయ్యప్పలకు అన్నప్రసాద వితరణ

సీతంపేట: శంకరమఠం అయ్యప్ప దీక్షా పీఠంలో గురువారం నుంచి అన్నప్రసాద వితరణ జరుగుతుందని శ్రీపూర్ణ పుష్కల అయ్యప్ప సేవా ట్రస్టు, అఖిల భారతీయ అయ్యప్ప ధర్మ ప్రచార సభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పైలా ఆదిమోహన్‌రెడ్డి తెలిపారు. జనవరి 10 వరకు ప్రతి రోజూ మధ్యాహ్నం నిత్య అన్నదాన ప్రసాద వితరణ జరుగుతుందని, అయ్యప్ప స్వాములు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ నెల 24 నుంచి 26 వరకు ఏయూ గ్రౌండ్స్‌లో అయ్యప్ప మహా సంగమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

అన్నదానం ప్రారంభం



అయ్యప్ప స్వాములకు అన్నప్రసాదం వడ్డిస్తున్న కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్

సీతంపేట: శబరిగిరి పీఠం ఆధ్వర్యంలో సీతంపేట కనకమ్మవారి వీధిలో బుధవారం అయ్యప్ప స్వాములకు 25వ వార్డు కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్ చేతుల మీదుగా అన్నదానం (భిక్ష) ప్రారంభించారు. మండలం పాటు ప్రతి రోజూ మధ్యాహ్నం అయ్యప్పలకు అన్నదానం జరుగుతుందని పీఠం ప్రతినిధులు తెలిపారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ గోవింద్‌ను సత్కరించారు. ముందుగా పీఠంలో పూజలు చేశారు. కార్యక్రమంలో గురుస్వామి ఎల్.కె.రాజు, అన్నదాన ప్రధాన సేవకురాలు మాదాబత్తుల పాప, మాదాబత్తుల శ్రీనివాస్, కనకరత్నం, సాయి, విశాఖ, తవిటిరాజు, మొకర వెంకటరావు, చంటి, నమ్మి వెంకట్, భాస్కరరావు, గురుస్వాములు, అయ్యప్ప మాలధారులు పాల్గొన్నారు.

నేడు సహస్ర తులసీదళార్చన

దాబాగార్డెన్స్: బురుజుపేట కనకమహాలక్ష్మి దేవాలయంలో గురువారం ఉదయం 8 నుంచి 9 గంటల వరకు సహస్ర తులసీదళార్చన నిర్వహించనున్నారు. భక్తులు రూ.1,500 పూజా రుసుం చెల్లించి పూజలో పాల్గొనవచ్చు. భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్‌ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806091లో చెల్లించాలి. ఆన్‌లైన్ ద్వారా ట్రాన్స్‌ఫర్ చేసిన భక్తులు వివరాలు, పూజ జరిపించాల్సిన వారి పేరు, గోత్రనామాలు, పూర్తి చిరునామా 89855 15989 నంబర్‌కు వాట్సాప్ చేయాలి.

వైభవంగా దుర్గమ్మ ఊరేగింపు



అమ్మవారి ఊరేగింపును ప్రారంభిస్తున్న సంపంగి శ్రీనివాసరావు, కమిటీ సభ్యులు

సీతంపేట: క్రేజీ బాయ్స్ ఆధ్వర్యంలో ఈ నెల 23 నుంచి సీతంపేటలో నిర్వహిస్తున్న దుర్గా శరన్నవరాత్రి ఉత్సవాలు బుధవారంతో ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా మేళతాళాలు, సంప్రదాయ సాంస్కృతిక కార్యక్రమాలతో అమ్మవారి ఊరేగింపు వైభవంగా నిర్వహించారు. సింహాచలం దేవస్థానం పాలక మండలి సభ్యుడు సంపంగి శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా పూజలు చేసి అమ్మవారి ఊరేగింపును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రేజీ బాయ్స్ వినూత్నంగా ఏర్పాటు చేసిన అమ్మవారి మండపాన్ని నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలి వచ్చి చూశారన్నారు. సింహం ఆకృతిలో ప్రవేశ ద్వారం, అక్వేరియం ఫ్లోరింగ్‌తో వినూత్నంగా ఏర్పాటు చేసిన మండపం సీతంపేటకు మంచి గుర్తింపు తెచ్చిందని నిర్వాహకులను అభినందించారు. కార్యక్రమంలో భీమవరపు శ్రీనివాసరావు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మహనీయుడు అమరజీవి పొట్టి శ్రీరాములు



పొట్టి శ్రీరాములు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కె.కె.రాజు, కార్పొరేటర్లు, పార్టీ నాయకులు

సీతమ్మధార: ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా బుధవారం బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో అమరజీవి పొట్టి శ్రీరాములు చిత్రపటానికి నెడ్‌క్యాప్ చైర్మన్, ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్ర అవతరణకు పొట్టి శ్రీరాములు చేసిన కృషి మరువలేనిదన్నారు. తెలుగు జాతి కోసం ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు కావాలని ప్రాణత్యాగం చేసిన మహనీయుడని కొనియాడారు. కార్యక్ర మంలో జీవీఎంసీ ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావు, కార్పొరేటర్లు కె.అనిల్‌కుమార్‌రాజు, సాడి పద్మారెడ్డి, సారిపల్లి గోవింద్, ఆళ్ల లీలావతి, వి.ప్రసాద్, శశికళ, కో–ఆప్షన్ సభ్యుడు సేనాపతి అప్పారావు, రాష్ట్ర యాత కార్పొరేషన్ చైర్‌పర్సన్ పిల్లి సుజాత, జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు ఆళ్ల శివగణేష్, మండల ఇన్‌చార్జులు కృష్ణారావు మాస్టార్, బులుసు జగదీస్, అమర్‌రెడ్డి, వసంతల అప్పారావు, డైరెక్టర్లు రాయుడు శ్రీనివాస్, వెంకటలక్ష్మి, రత్నాకర్, భోగవిల్లి గోవింద్, ఎం.సునీల్, మహదాస్య గోపి, చిన్నా, రాజ్ కుమారి పాల్గొన్నారు.

జీఆర్పీ ఆధ్వర్యంలో రాష్ట్ర అవతరణ దినోత్సవం



రైల్వేస్టేషన్‌లో జెండాకు సెల్యూట్ చేస్తున్న డీఎస్ఆర్పీ మోహనరావు, రైల్వే పోలీసులు

తాటిచెట్లపాలెం: విశాఖ రైల్వే స్టేషన్‌లో గవర్నమెంట్ రైల్వే పోలీసుల(జీఆర్పీ) ఆధ్వర్యంలో ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ రైల్వే పోలీస్ బి.మోహనరావు చేతుల మీదుగా జెండా ఆవిష్కరించారు. ముందుగా అమరజీవి పొట్టి శ్రీరాములు చిత్రపటం వద్ద నివాళులర్పించారు. కార్యక్రమంలో సీఐ ధనుంజయనాయుడు, ఎస్‌ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

అలరించిన లలిత సంగీత విభావరి

సీతంపేట: శ్రీమన్నారాయణ సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో బుధవారం పద్మభూషణ్ దేవులపల్లి కృష్ణశాస్త్రి 126వ జయంతి సందర్భంగా ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో లలిత సంగీత విభావరి నిర్వహించారు. సంస్థ వ్యవస్థాపక అధ్యక్షురాలు పోలుకొండ నాగలక్ష్మి ఆధ్వర్యంలో పలువురు గాయనీ గాయకులు లలిత గీతాలను ఆలపించి అలరించారు. వి.ప్రభాకర్, త్రినాథ్, భాస్కర్, వరలక్ష్మి, కనకదుర్గ, జాస్మిన్, భారతి, శశిరాణి, జయంతి, సరిత లలిత గీతాలను ఆలపించారు. కార్యక్రమంలో రైటర్స్ అకాడమీ చైర్మన్ వి.వి.రమణమూర్తి, వర్రె నాంచారయ్య, బి.ఎన్.మూర్తి, మేడా మస్తాన్‌రెడ్డి పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో ఇద్దరు గంజాయి నిందితులు



సీతమ్మధార: గుట్టుచప్పుడు కాకుండా గంజాయి తరలిస్తున్న ఇద్దరిని టాస్క్‌ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకుని ద్వారకా పోలీసులకు అప్పగించారు. వారు తెలిపిన వివరాలిలా.. బెంగుళూరుకు చెందిన మనోజ్‌కుమార్, కుమార్‌రాజు ఒడిశా రాష్ట్రంలోని బాలంగిరిలో 7.5 కిలోల గంజాయి కొనుగోలు చేసి బుధవారం నగరానికి వచ్చారు. రామాటాకీస్ దరి కావేరి ట్రావెల్స్ వద్ద అనుమానాస్పదంగా వారు కనిపించడంతో అటుగా వెళ్తున్న టాస్క్‌ఫోర్స్ ఏసీపీ త్రినాథ్ తన సిబ్బంది కలిసి ఆ ఇద్దరిని అదుపులోకి తీసుకుని విచారించారు. ఒడిశాలో 7.5 కిలోల గంజాయి కొని బెంగుళూరుకు తీసుకెళ్తున్నట్లు నిందితులు తెలిపారు. టాస్క్‌ఫోర్స్ నుంచి ద్వారకా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

ఆరాధ్యనీయుడు మాస్టర్ ఈకే



పూర్ణాహుతి క్రతువులో పాల్గొన్న డాక్టర్ శాస్త్రి, చింతలపాటి సత్యదేవ్ దంపతులు

తాటిచెట్లపాలెం: లోక కల్యాణమే సనాతన క్రతువుల పరమార్థమని, వేద సంప్రదాయాన్ని సామాన్యులకు అందుబాటులోకి తెచ్చిన మాస్టర్ ఎక్కిరాల కృష్ణమాచార్య(ఈకే) ఆరాధ్యనీయుడయ్యారని జగద్గురు పీఠం జాతీయ అధ్యక్షుడు డాక్టర్ కె.ఎస్.శాస్త్రి తెలిపారు. తాటిచెట్లపాలెంలోని మాస్టర్ ఈకే సంస్కృతి సదన్ ప్రాంగణంలో బుధవారం లక్ష్మీగణపతి విగ్రహ ప్రతిష్ఠాపన ఘనంగా చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన గోపూజను ట్రస్ట్ ఉపాధ్యక్షులు ఎస్.వి.ఎస్.మూర్తి దంపతులు నిర్వహించగా, సంస్థ డైరెక్టర్ చింతలపాటి సత్యదేవ్ లక్ష్మీగణపతి హోమాన్ని జరిపి అనంతరం విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా సత్యదేవ్ మాట్లాడుతూ మాస్టర్ పార్వతీకుమార్ సంకల్పం మేరకు సంస్కృతి సదన్‌లో గణపతి విగ్రహాన్ని ప్రతిష్ఠించామని తెలిపారు. సంస్కృతి సదన్‌లో మాస్టర్ హోమియో వైద్యాలయం, మహాత్మా గాంధీ మహిళా కేంద్రం, సంగీత జనకులం ద్వారా ఉచితంగా శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పూర్ణాహుతి క్రతువులో సంస్థ కార్యనిర్వాహక బృంద సభ్యులు బి.ఆర్.కె.రాజు, బి.ఉషారాణి, యు.సిహెచ్.బి.వర్మ, ధనిష్టా ఫౌండేషన్ మేనేజింగ్ ట్రస్టీ కంభంపాటి గురుప్రసాద్, బాలభాను విద్యాలయం ప్రిన్సిపాల్ ఎస్.శుభశ్రీ, మిహిర మాసపత్రిక సంపాదకుడు మల్లంపల్లి ప్రద్యుమ్న పాల్గొన్నారు.

లక్ష్మీవినాయక ఆలయంలో మేయర్ పూజలు



ప్రత్యేక పూజల్లో పాల్గొన్న మేయర్ గొలగాని హరివెంకటకుమారి

తాటిచెట్లపాలెం: తాటిచెట్లపాలెం జాతీయ రహదారి పక్కన గల లక్ష్మీవినాయక ఆలయంలో బుధవారం సంకష్ట హర చతుర్థి సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక పూజల్లో మేయర్ గొలగాని హరి వెంకటకుమారి పాల్గొన్నారు. ఈ సందర్భంగా హోమం, పంచామృతాభిషేకాలు, అర్చనలు ఘనంగా జరిగాయి. మేయర్‌ను ఆలయ సంప్రదాయం ప్రకారం వేదమంత్రాలు, వినాయక శేషవస్త్రాలతో సత్కరించారు. ఆధ్యాత్మిక వేత్త ఎంవీ రాజశేఖర్, యు.ఎస్.శర్మ, పి.ఆర్.ఎస్.నాయుడు, పి వేణుగోపాలరావు, శ్రీ గురుపాద సేవా సమితి సభ్యులు, స్థానికులు పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య

సీతమ్మధార: ఆర్థిక ఇబ్బందులతో ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలిలా.. ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధి క్రౌన్ బేకరీ ఎదురుగా గల 80 ఫీట్ రోడ్డులోని అక్కయ్యపాలెం సంకువానిపాలెంలో తండ్రి హుస్సేన్, కుటుంబ సభ్యులతో కలిసి కుమారుడు పఠాన్ బషీర్(26) నివసిస్తున్నాడు. గతంలో గల్ఫ్ దేశానికి రూ.లక్షా 50 వేల అప్పు చేసి యువకుడు వెళ్లాడు. అక్కడ పని సరిగా లేకపోవడంతో తిరిగి వచ్చేశాడు. అప్పుల భారం పెరగడంతోపాటు బషీర్ తండ్రి ఆరోగ్య పరిస్థితి కూడా బాగోలేదు. రెండు రోజుల కిందట ఈఎన్‌టీ ఆస్పత్రిలో సర్జరీ కోసం తండ్రిని జాయిన్ చేశారు. మంగళవారం రాత్రి ఎప్పటిలాగే తల్లి, కుమారుడు భోజనం చేసి పడుకున్నారు. రాత్రి 11 నుంచి 12 గంటల మధ్యలో వాష్‌రూమ్‌కు వెళ్తానని చెప్పి పఠాన్ బషీర్ ఇంట్లో ఫ్యాన్‌కు వైరులతో ఉరివేసుకొని మృతిచెందాడు. బుధవారం ఉదయం తల్లి నిద్రలేచి చూసే సరికి కొడుకు ఫ్యాన్‌కు వేలాడుతూ విగతజీవిగా కనిపించాడు. ఆమె కన్నీరు మున్నీరైంది. ఫోర్త్‌టౌన్ పోలీసులకు చేసిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు.

వ్యాధులపై అవగాహన



వ్యాధులపై అవగాహన కల్పిస్తున్న వైద్యులు

మహారాణిపేట: ఇండియన్ సొసైటీ ఆఫ్ క్రిటికల్ కేర్ మెడిసిన్(ఐఎస్‌సీసీఎం) విశాఖపట్నం చాప్టర్ ఆధ్వర్యంలో బుధవారం జిల్లా పరిషత్ సమీపంలోని అంకోసాలో అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ప్రముఖ చార్టెడ్ అకౌంటెంట్, రోటరీ క్లబ్ వైజాగ్ అధ్యక్షుడు డి.ఎం.రావు హాజరయ్యారు. డాక్టర్ కుచేలబాబు, డాక్టర్ రవీంద్రబాబు తదితరులు పలు వ్యాధులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో విశాఖ చాప్టర్ అధ్యక్షురాలు డాక్టర్ టి.లక్ష్మి రాణి, కార్యదర్శి డాక్టర్ రమాదేవి, వైద్యులు ఎస్.అనూరాధ, మంజుల, వరలక్ష్మి, భవ్య, డాక్టర్ రవికృష్ణ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

చురుగ్గా పింఛన్ల పంపిణీ

- జోన్–5లో 83 శాతం పూర్తి



కంచరపాలెంలో లబ్ధిదారుకు పింఛన్ అందిస్తున్న వలంటీర్ సాయి, గృహసారథి రమేష్

కంచరపాలెం: జీవీఎంసీ జోన్–5 పరిధిలో బుధవారం వైఎస్సార్ పెన్షన్ కానుక పంపిణీ కార్యక్రమం చురుగ్గా చేపట్టినట్లు జోనల్ కమిషనర్ ఆర్.జి.వి.కృష్ణ తెలిపారు. ఉత్తర, పశ్చిమ నియోజకవర్గాల పరిధిలోని 24 వార్డులకు సంబంధించి టీపీఆర్‌వో ఏపీడీ, సచివాలయ వెల్ఫేర్ సెక్రటరీల నేతృత్వంలో వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు, డయాలసిస్ రోగులు, ఇతరత్రా పింఛన్లను వలంటీర్లు అందజేసినట్లు చెప్పారు. వేకువజాము నుంచే లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్ సొమ్ము అందించారన్నారు. జోన్–5కు సంబంధించి మొత్తం 26,929 మంది పింఛదారులకు గానూ 22,365 మందికి పంపిణీ చేశామన్నారు. తొలి రోజు సుమారు 83 శాతం పెన్షన్ పంపిణీ పూర్తి చేసినట్లు యూసీడీ ఏపీడీ అధికారి పద్మావతి తెలిపారు. ఇళ్లకే కాకుండా ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న పెన్షనర్ల వద్దకు వెళ్లి వారికి పింఛన్ నగదును అందించారు. శుక్రవారానికి 100 శాతం పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామని జెడ్సీ కృష్ణ తెలిపారు. జోన్–5 ఏపీడీ అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పూర్తి స్థాయిలో పనిచేయాలని ఆదేశించారు.

కాలుష్య రహితంగా దీపావళి



మాట్లాడుతున్న జలగం కుమారస్వామి

సీతంపేట: దీపావళి పండగను కాలుష్య రహితంగా, సంప్రదాయబద్ధంగా జరుపుకుందామని భారత కిసాన్ సంఘ్ జాతీయ నాయకుడు జలగం కుమారస్వామి పిలుపునిచ్చారు. ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో గో ఆధారిత ప్రకృతి రైతుల సంఘం బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మట్టి, ఆవు పేడతో తయారు చేసిన ప్రమిదలో నూనె, నెయ్యి వేసి దీపాలు వెలిగించాలన్నారు. అత్యంత శబ్ద, వాయు కాలుష్యం కలిగించే చైనా దేశానికి చెందిన టపాసులు కాల్చి అనారోగ్యం తెచ్చుకోవద్దని, పశు పక్ష్యాదులకు హాని కలగకుండా పండగ చేసుకోవాలని సూచించారు. రసాయనాలు, భారలోహాలతో తయారు చేసిన టపాసులు అత్యంత ప్రమాదకరమని అందరూ గ్రహించాలన్నారు. వ్యవసాయ శాస్త్రవేత్త అశోక్‌కుమార్ మాట్లాడుతూ పత్తి పండిస్తున్న రైతులను ఆదరించి, వారు పండించిన దూది ఒత్తులతో దీపాలు వెలిగించాలన్నారు. కుమ్మరి తయారు చేసిన ప్రమిదలు, గానుగలో తయారు చేసే నూనె వినియోగించాలని సూచించారు. కార్యక్రమంలో నగర మిద్దె తోటల సంఘం ప్రతినిధి ఎం.ఐశ్వర్య, రైతుల సంఘం అధ్యక్షులు దాట్ల సుబ్రహ్మణ్య వర్మ, సిహెచ్.మురళీధర్ పాల్గొన్నారు.

అయ్యప్ప అన్నసమారాధన ట్రస్ట్‌కు చొక్కాకుల విరాళం



అన్నదానం చేస్తున్న చొక్కాకుల లక్ష్మీ వెంకటరావు, చొక్కాకుల అనిల్ దంపతులు

తాటిచెట్లపాలెం: యెరిమేలి అయ్యప్ప అన్నసమారాధన ట్రస్ట్‌కు రూ.65 వేల విరాళాన్ని వీకేపీసీపీఐఆర్ యూడీఏ చైర్‌పర్సన్ చొక్కాకుల లక్ష్మీ, వెంకటరావు దంపతులు అందజేశారు. తాటిచెట్లపాలెం హైవే పక్కన ట్రస్ట్ ఆధ్వర్యంలో మాలధారులకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన నిత్య అన్నసమారాధనలో ఒక రోజు అన్నదానానికి అవసరమైన మొత్తాన్ని అందించారు. వారి కుమారుడు చొక్కాకుల అనిల్ జన్మదినం సందర్భంగా ఈ ఆర్థిక సాయం చేసి, బుధవారం నిర్వహించిన అన్నదానంలో కుటుంబ సభ్యులు పాల్గొని మాలధారులకు అన్నప్రసాదం వడ్డించారు. ఈ సందర్భంగా చొక్కాకుల వెంకటరావు మాట్లాడుతూ ఇటువంటి మంచి కార్యక్రమం నిర్వహిస్తున్న యెరిమేలి అయ్యప్ప అన్నసమారాధన ట్రస్ట్ సభ్యులను అభినందించారు. అనంతరం ట్రస్ట్ ప్రతినిధులు చొక్కాకుల వెంకటరావు దంపతులు, చొక్కాకుల అనిల్ దంపతులను శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో అక్కేన జగన్, సురేష్, అన్నసమారాధన ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

నవ కవులకు మార్గదర్శి శ్రీశ్రీ



మాట్లాడుతున్న శేఖరమంత్రి ప్రభాకర్

సీతంపేట: సహృదయ సాహితి సంస్థ ఆధ్వర్యంలో బుధవారం రాజేంద్రనగర్ ప్రిజం కళాశాలలో నిర్వహించిన కవి సమ్మేళనం అలరించింది. సభాధ్యక్షుడు శేఖరమంత్రి ప్రభాకర్ మాట్లాడుతూ కవిత్వం ఉత్తమ విలువలతో కూడినదై సమాజ ఉన్నతికి దోహదపడాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఔత్సాహిక కవులు పూర్వ కవుల రచనలు ఎక్కువగా చదవాలని, నవ కవులకు మార్గదర్శి మహాకవి శ్రీశ్రీ అని తెలిపారు. నేటి నవ కవులందరూ శ్రీశ్రీ సాహిత్యాన్ని చదవాలని సూచించారు. డాక్టర్ కె.జి.వేణు తెలంగాణ ప్రజాకవి గూడ అంజయ్య జీవితం, సాహిత్యం గురించి ప్రసంగించారు. డాక్టర్ డి.వి.సూర్యారావు మాట్లాడుతూ కవి అంటే కృష్ణశాస్త్రి అని, ఆయన భావకవిత్వానికి ఆద్యుడని, సంస్కారవంతమైన కవిత్వం రాశారని తెలియజేశారు. అనంతరం జరిగిన కవి సమ్మేళనంలో రామతాత నీలి మేఘాలలో కవిత, కుమారి ఆశ్రిత ఎండుటీ ఊగిసలాట కవిత, కె.వి.ఎస్.మూర్తి లోకం పోకడ కవిత, కొత్తూరి రమణ పల్లె పడుచు కవిత, చిన సూర్యనారాయణ సమైక్య హృదయ సంస్కారం కవిత, రమణమూర్తి పులిలా కవిత చదివి వినిపించారు.

నేడు మృతుల సంస్మరణ దినం

కంచరపాలెం: జ్ఞానాపురం కాన్వెంట్ కూడలిలో ఈ నెల 2వ తేదీ గురువారం మృతుల సంస్మరణ దినం (సమాధుల పండగ) నిర్వహించనున్నట్లు జ్ఞానాపురం పునీత పేతురు ప్రధాన దేవాలయం చర్చి రెవరెండ్ ఫాదర్ జొన్నాడ జాన్‌ప్రకాశ్ తెలిపారు. ఈ సందర్భంగా మత గురువులు, క్రైస్తవులు శ్మశాన వాటికల్లో ప్రత్యేక ప్రార్థనలు చేయనున్నట్లు పేర్కొన్నారు. వేడుకల్లో ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యురాలు, వార్డు కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ తెలిపారు. ఏర్పాట్లపై ఆమె జాన్‌ప్రకాశ్‌తో మాట్లాడారు.